సాక్షి
ఖమ్మం
మంగళవారం । 6 । జూన్ । 2023



బ్రిటీష్ తరహా పాలన

దేశంలో బ్రిటీష్ తరహా పాలన సాగుతోందని ఎన్డీ కేంద్ర కమిటీ సభ్యుడు సాదినేని వెంకటేశ్వరరావు విమర్శించారు.

8లో



చేపల వేట ఆరంభం

వైరా రిజర్వాయర్‌లో మత్స్యకారులు చేపల వేట ఆరంభించారు. తొలిరోజైన సోమవారం 80టన్నులకు పైగా చేపలు పట్టారు.

8లో

గరిష్ఠం / కనిష్ఠం
43° / 29°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదువుతాయి. మధ్యాహ్నం జిల్లావ్యాప్తంగా వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మొక్కలు నాటితేనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్, తదితరులు

ఖమ్మంలీగల్: సమాజంలోని ప్రతీఒక్కరు బాధ్యతు మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో పాలుపంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన సోమవారం న్యాయసేవా సదన్‌లో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కల పెంపకంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ఇతర మార్గాలను అన్వేషించాలని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత కోర్టుగా ఖమ్మం కోర్టు మారాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పర్యావరణవేత్త డాక్టర్ కడివెండి వేణుగోపాల్‌ను, కోర్టు తోటమాలి పి.సత్యవతిని జిల్లా న్యాయమూర్తి సత్కరించారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, ఎస్.అమరావతి, కె.ఆశారాణి, వి.మాధవి, కె.దీప, ఆర్.శాంతిలత, సలీం, న్యాయవాది మాదిరాజు లక్ష్మీనారాయణ, కోర్టు ఏఓ ఏ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

పోలీసులకు విశిష్ట సేవాపతకాలు



కలెక్టర్, సీపీ చేతుల మీదుగా పతకాలు అందుకుంటున్న సిబ్బంది

ఖమ్మంక్రైం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సురక్ష దినోత్సవంలో వివిధ విభాగాల్లో విశిష్ట సేవలందించిన పోలీసులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలు అందజేశారు. 2022 సంవత్సరానికిగాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో 35మంది పోలసు ఉద్యోగులకు పతకాలు ప్రకటించింది. ఈమేరకు కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ ఉద్యోగులకు ఆదివారం రాత్రి పరేడ్ మైదానంలో జరిగిన సమావేశంలో పతకాలు అందజేశారు.

డయల్ 100కు 4,073 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజల ధన, మాన ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటుచేసిన డయల్ 100కు మంచి స్పందన లభిస్తోందని సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. గడిచిన మే నెలలో 4,073 మంది ఫోన్ చేశారని పేర్కొన్నారు. ఇందులో ఫిర్యాదుల తీవ్రత ఆధారంగా 107 ఘటనలపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, కొందరికి సరైన అవగాహన లేక తప్పుడు సమాచారంతో ఫోన్ చేస్తున్నారని, అలా కాకుండా అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

కార్పొరేట్ కళాశాలల దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కార్పొరేట్ కళాశాలల పథకానికి దరఖాస్తు గడువు ఈనెల 11వ తేదీ వరకు పొడిగించినట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, 2022–23 విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈపాస్ వెబ్‌సైట్‌లో కొత్త వారితో పాటు రెన్యూవల్ విద్యార్థుల రిజిస్ట్రేషన్‌కు అవకాశముందని వెల్లడించారు.

11న ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు బాడ్మింటన్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని వెంకట్రావు, ఎస్.ఉప్పల్‌రెడ్డి తెలిపారు. సీనియర్స్ విభాగంలో 35, ప్లస్ 40, 45, 50, 55, 60, 65 ఏళ్ల పైబడిన విభాగాల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నిర్ణీత ఫీజు చెల్లించి ఈనెల 9వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 93969 72349, 94418 64167 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యంత్ర తంత్రం..!

జిల్లాలో దూసుకెళ్తున్న గ్రానైట్ పరిశ్రమ

- సాగర్ ఆయకట్టుతో రైస్‌మిల్లుల్లోనూ అగ్రగామి
- ప్రత్యక్షంగా 40వేల మందికి, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి
- త్వరలోనే పామాయిల్ ఫ్యాక్టరీ, రెండు ఇథనాల్ పరిశ్రమలు
- నేడు పారిశ్రామిక ప్రగతి ఉత్సవం



గ్రానైట్ పరిశ్రమలో పాలిషింగ్ చేస్తున్న కార్మికుడు

ఖమ్మంఅర్బన్: జిల్లా పారిశ్రామిక రంగంలో దూసుకెళ్తోంది. ఏళ్ల క్రితమే ఇక్కడ గ్రానైట్ పరిశ్రమలు ఏర్పాటుకాగా.. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల కార్మికులకు ఉపాధి లభిస్తోంది. ఇక సాగర్ ఆయకట్టు ఉండడంతో రైస్‌మిల్లులు కూడా పదుల సంఖ్యలో ఏర్పాటయ్యాయి. అలాగే, తెలంగాణ వచ్చాక పరిశ్రమలకు అనుమతులు సరళీకృతం చేయడం, బ్యాంకులు రుణాలు ఇస్తుండడంతో ఔత్సాహికులు ముందుకొస్తున్నారు. త్వరలోనే రూ.250కోట్ల పెట్టుబడితో రెండు ఇథనాల్ పరిశ్రమలు ఏర్పాటుకానుండగా, సత్తుపల్లి నియోజకవర్గంలో పామాయిల్ ఫ్యాక్టరీ కూడా అందుబాటులోకి రానుంది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహించనుండగా కథనం.

ప్రధానంగా గ్రానైట్

జిల్లాలో వివిధ పరిశ్రమల ద్వారా ప్రత్యక్షంగా 40వేల మంది, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తోంది. ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమలు జిల్లాకు పేరు తీసుకొస్తున్నాయి. అలాగే, శ్లాబ్స్, టైల్స్ తదితర పరిశ్రమలు 600 పైగానే ఉండగా.. మొత్తం కలిపితే జిల్లాలో 2,800పైగానే పరిశ్రమలు ఉన్నట్లు అంచనా. వీటికి తోడు 400పైగా రైసుమిల్లులు, 40పైగా కోల్డ్‌స్టోరేజీలు, స్టోన్‌క్రషర్ మిల్లులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటయ్యాయి. తెలంగాణ వచ్చాక 925 పరిశ్రమలకు అనుమతి ఇవ్వగా ఇప్పటికే కొన్ని కార్యకలాపాలు మొదలుపెట్టాయి. మరికొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయి.

ఇథనాల్ రెడీ..

తాజాగా జిల్లాలోని మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రూ.250 కోట్ల పెట్టుబడితో రెండు ఇథనాల్ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే అన్ని అనుమతులు జారీ అయ్యాయని అధికారులు తెలిపారు. అలాగే, సత్తుపల్లి నియోజకవర్గంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తయింది. అంతేకాక మొక్కజొన్న విత్తనాల పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశముంది.

జిల్లాలో అనువైన పరిస్థితులు



జిల్లాలో గ్రానైట్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. గత తొమ్మిదేళ్లలో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలతో ఔత్సాహికులకు సులువుగా అనుమతులు మంజూరు కావడమేకాక, సబ్సిడీలు అందుతున్నాయి. 925 పరిశ్రమలకు అనుమతి ఇవ్వగా, రూ.1,300 కోట్ల పెట్టుబడితో రూ.3వేల కోట్లకు పైగా టర్నోవర్ నమోదైంది.

– అజయ్‌కుమార్, జిల్లా పరిశ్రమల మేనేజర్

ఔత్సాహికులకు సబ్సిడీలు

గడిచిన కొన్నేళ్లలో జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు కోసం ముందుకొచ్చిన వారికి వివిధ రూపాల్లో రూ.195 కోట్ల మేర సబ్సిడీ మంజూరు చేశారు. టీఎస్ ఐపాస్ విధానంతో దరఖాస్తుదారులకు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్‌లోనే పదిహేను రోజుల్లోగా అనుమతులు జారీ అవుతున్నాయి. అలాగే, బ్యాంక్‌లు 80 శాతం మేర రుణాలు ఇస్తుండడం, ప్రభుత్వం విద్యుత్ రాయితీ, కనెక్షన్ల జారీని సులభతరం చేసింది. టీఎస్ ఐపాస్ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు రూ.1,295.30 కోట్ల పెట్టుబడితో 925 యూనిట్లు ఏర్పాటుకాగా, టీ ఐడియా పథకం ద్వారా 2,329మంది దరఖాస్తుదారులకు రూ.68,85కోట్ల రాయితీలు మంజూరైంది. అలాగే, టీ ప్రైడ్ ద్వారా ఎస్సీలు 1,009మందికి రూ.67.67కోట్లు, ఎస్టీలు 1,166మందికి రూ.55.80కోట్లు, దివ్యాంగులు 80మందికి రూ.6.45కోట్ల రాయితీ అందించారు.

సింగరేణితోనే పరిశ్రమలు, ఉపాధి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర, జీఎం రమేష్ తదితరులు

- రూ.183 కోట్ల డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి
- సింగరేణి సంబురాల్లో కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: బొగ్గు నిక్షేపాలు ఉన్నచోట పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా లాభమే తప్ప నష్టం ఉండదని పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సత్తుపల్లిలో సోమవారం సింగరేణి సంబురాలు నిర్వహించారు. గిరిజన సంప్రదాయ కొమ్ము నృత్యాలు, బతుకమ్మలు, కాగడాలతో తెలంగాణ రన్ ఆకట్టుకోగా కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ ఆధ్వార్యన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో డీఎంఎఫ్ నిధులు రూ.183 కోట్లు, సీఎస్ఆర్ నిధులు రూ.30 కోట్లను సత్తుపల్లి పరిధిలో అభివృద్ధికి వెచ్చించామని తెలిపారు. సత్తుపల్లి రైల్వేలైన్‌తో బొగ్గు రవాణా సులభం కాగా, భవిష్యత్‌లో ప్యాసింజర్ రైళ్లు నడిపే అవకాశముందని చెప్పారు.

ప్రభుత్వరంగం సంస్థ కావడంతోనే...

సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ కావడంతోఅభివృద్ధి, సంక్షేమానికి నిధులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలవవుతున్నాయని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. దేశంలోనే లాభాల్లో ఉన్న సింగరేణిని ప్రైవేట్‌పరం చేయటానికి జరుగుతున్న కుట్రలను తిప్పికొడతామన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో బాంబ్ బ్లాస్టింగ్‌తో దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన అనంతరం స్థానికుల సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. జీఎం రమేష్ మాట్లాడుతూ భవిష్యత్‌తో కొత్తగూడెం–సత్తుపల్లి రైల్వేలైన్ కొవ్వూరు వరకు విస్తరిస్తుందన్నారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణ, ఏసీపీ రామానుజం, మున్సిపల్ కమిషనర్ కె.సుజాతతో పాటు అధికారులు, నాయకులు శ్యామ్యూల్ సుధాకర్, రఘురాంరెడ్డి, రామకృష్ణ, కోటిరెడ్డి, ఎస్.వెంకటాచారి, నర్సింహారావు, శ్రీరమేష్, రవీందర్, బుడగం రామకృష్ణ, రమణారెడ్డి, అబ్దుల్ రజాక్, ఉపేంద్రాచారి, గణపనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు ప్రవేశించిన ఉత్తరాఖండ్

పరుగు తేడాతో ఓడిపోయిన తెలంగాణ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: ఆల్ ఇండియా మహిళా టీ–20 క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం జరిగిన మొదటి సెమీస్‌లో తెలంగాణ జట్టు ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలు కాగా ఉత్తరాఖండ్ జట్టు విజయం సాధించి ఫైనల్స్‌లోకి దూసుకెళ్లింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఉత్తరాఖండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేయగా, జట్టులో సాక్షి వెగాహం 51 బంతులు ఎదుర్కొని ఏడు ఫోర్లతో 65 పరుగులు, డింపాల్ కాందరి 22 పరుగులు చేశారు. మొత్తంగా ఎక్స్‌ట్రా రన్స్ 25 లభించడం గమనార్హం. అతర్వాత బ్యాటింగ్ చేసిన తెలంగాణ జట్టు చివరి బంతి వరకు పోరాడినా 9 వికెట్ల నష్టానికి 136 పరుగులే చేయడంతో ఓటమి పాలైంది. జట్టులో నవీన ఐదు ఫోర్లతో 42 పరుగులు చేయగా, చందన 31, పార్వతి 13, అంజలి 11, ప్రసన్న ఎనిమిది పరుగులు చేశారు. కాగా, మరో సెమీఫైనల్స్ మ్యాచ్ ఆంధ్రప్రదేశ్– మహారాష్ట్ర జట్ల మధ్య జరగనుండగా, గెలిచిన జట్టుతో ఉత్తరాఖండ్ జట్టు ఫైనల్స్‌లో తలపడుతుందని నిర్వాహకులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్, ఎం.డీ.మతిన్ తెలిపారు.

కేసీఆర్‌ను గద్దె దించేవరకు పోరాటం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

సత్తుపల్లిరూరల్: నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాలను అమ్ముకుంటున్నారని.. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేవరకు పోరాడుతామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో వివాదాస్పదంగా మారిన సర్వే నంబర్ 334లోని భూములను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల నుంచి రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో ఇంటి దొంగలు ఉన్నారని.. బోర్డును ప్రక్షాళన చేసి అన్ని ఉద్యోగాలకు మళ్లీ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 35 లక్షల మంది నిరుద్యోగుల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. టీఎస్‌పీఎస్సీలో అసలు దోషులను పట్టుకోకుండా చిన్నచిన్న స్థాయిలో వారిని అరెస్ట్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శీలం వెంకటేశ్వరరావు, సుదర్శన్, చంటి, ఉపేంద్ర, శ్రీనివాసరావు, చంద్రమోహన్, సుభాని పాల్గొన్నారు.

మిర్చి 'ధర'హాసం



ఖమ్మం మార్కెట్‌లో జెండా పాటలో పాల్గొన్న వ్యాపారులు, పర్యవేక్షిస్తున్న అధికారులు



మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి

- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.24,500
- విదేశీ ఎగుమతులతో నిల్వ మిర్చికి డిమాండ్

ఖమ్మంవ్యవసాయం: మిర్చికి డిమాండ్ ధర పలుకుతోంది. వేసవి సెలవుల తర్వాత ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సోమవారం తెరుచుకోగా.. పలువురు రైతులు ఇళ్లలో, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన మిర్చిని విక్రయానికి తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ బంద్ కాక ముందు ఉన్నట్లే ఇప్పుడు కూడా డిమాండ్ కొనసాగింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి జెండాపాటలో గరిష్ఠంగా రూ.24,500 ధర పలకగా, మోడల్ ధర రూ.20 వేలు, కనిష్ఠ ధర రూ.18 వేలుగా నమోదైంది. ఇక ఇళ్లలో నిల్వ చేసిన మిర్చికి రూ.12,500 నుంచి రూ.20వేల వరకు ధర పలికింది. అలాగే, తాలు మిర్చికి సైతం గరిష్ఠ ధర రూ.12,500 పలకడం విశేషం. సెలవుల అనంతరం తొలిరోజు మార్కెట్‌కు 6,158 బస్తాల మిర్చి తీసుకొచ్చారు.

నిల్వ మిర్చికి ఏటా డిమాండే..

ప్రతీ సంవత్సరం నిల్వ మిర్చికి మంచి డిమాండ్ ఉంటోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసే మిర్చికి అక్టోబర్, నవంబర్‌లో గరిష్ఠ ధరలు నమోదవుతుండగా, ఈసారి మే, జూన్‌లోనే అత్యధిక ధర పలికింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన తేజా రకం మిర్చికి గరిష్ఠంగా 2020లో రూ.20 వేలు, 2021లో రూ.21 వేలు, 2022లో రూ.22 వేల ధర పలకగా.. ఈసారి మే 13న రూ.25,800, ఇప్పుడు రూ.25 వేల అంచుకు చేరడం విశేషం. ఇక నాన్ ఏసీ మిర్చికి కూడా మంచి ధర లభిస్తోంది. ప్రస్తుత సీజన్‌లో మార్చి 20వ తేదీన గరిష్ఠంగా రూ.25,550 పలికి చరిత్ర సృష్టించింది.

ఈ ఏడాది రికార్డు ధరలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'తేజా' రకం మిర్చికి ఈ ఏడాది రికార్డు ధర పలుకుతోంది. విదేశాల్లో ఈ రకం మిర్చికి డిమాండ్ ఉండటంతో ధరకు రెక్కలొచ్చాయి. గతనెల 13న ఖమ్మం మార్కెట్‌లో నిల్వ మిర్చి ధర రూ.25,800గా.. మార్చి 20వ తేదీన రూ.25,550గా ధర నమోదైంది. ఈ ధరలే ఆల్ టైం రికార్డు అని వ్యాపారులు చెబుతున్నారు.

ప్రత్యేకం.. 'తేజ' రకం

ఉమ్మడి ఖమ్మంతో పాటు వరంగల్, నల్లగొండ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణ, గుంటూరు జిల్లాల్లో సాగు చేసే తేజా రకం మిర్చి కొనుగోళ్లలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకత చాటుతోంది. ఈ రకం మిర్చికి చైనా, మలేషియా, బంగ్లాదేశ్, సింగపూర్ తదితర దేశాల్లో డిమాండ్ ఉండగా.. ఎగుమతిదారులకు చైనా నుంచి ఆర్డర్లు అధికంగా వస్తాయి. దీంతో ఇక్కడి వ్యాపారులు కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. అలాగే, తెగుళ్లతో పంట దిగుబడి తగ్గిపోవడంతో ఉన్న పంటకు మంచి ధర పలుకుతోంది.

ఇళ్ల స్థలాల పంపిణీపై దృష్టి

- జిల్లాలో 58 ఎకరాల స్థలం గుర్తింపు
- సమీక్షలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



కలెక్టరేట్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ చేయాల్సి ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 58 ఎకరాల స్థలం నివాస స్థలాన్ని గుర్తించగా, 4,526 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అర్హుల జాబితా సిద్ధం చేసి పట్టాలు పంపిణీ చేయాలని చెప్పారు.

8న చెరువుల పండుగ

అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న చేపట్టే చెరువుల పండుగను విజయవంతం చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, మత్స్య శాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ 363 చెరువుల వద్ద పండుగ నిర్వహించాల్సి ఉన్నందున అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయకట్టు రైతులు, మత్స్యకారులను ఆహ్వానించి జీవనోపాధి సంబంధ సామగ్రితో వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. అలాగే, భోజనం ఏర్పాటుచేసి బతుకమ్మ, బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికగుప్తా, మయాంక్ సింగ్, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, డీఆర్డీఓ విద్యాచందన, ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, రాంబాబు, డీటీ రంజిత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో గౌతమ్ మొక్కలు నాటారు.

స్టేడియం పరిశీలన

వైరా: వైరాలోని ఇండోర్ స్టేడియాన్ని వీ.పీ.గౌతమ్ సోమవారం పరిశీలించారు. ఇండోర్, ఓపెన్ స్టేడియాలను పరిశీలించిన ఆయన నిర్మాణ పనులపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కాసేపు బ్యాడ్మింటన్ ఆడారు. తహసీల్దార్ నారపోగు అరుణ, మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు, డీవైఎస్ఓ పరంధామరెడ్డి పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామి వారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. జ్యేష్ఠాభిషేకం సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాన్ని సోమవారం యథావిధిగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

పర్యావరణ జిల్లాగా తీర్చిదిద్దాలి

ఖమ్మం సహకారనగర్: పర్యావరణంపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా పర్యావరణ జిల్లాగా ఖమ్మంను ప్రథమ స్థానంలో నిలపాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూట్ బ్యాగ్‌లు విడుదల చేసి మాట్లాడారు. ప్రతీఒక్కరు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగ్స్, క్లాత్ బ్యాగ్‌లను ఉపయోగించాలన్నారు. మిషన్ లైఫ్ – లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, పరిశ్రమలు, ఆస్పత్రుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో టీఎస్‌పీసీబీ కొత్తగూడెం పర్యావరణ ఇంజనీర్ బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



ఖమ్మంవ్యవసాయం: సూర్యుడి ప్రతాపం ఏ మాత్రం తగ్గడం లేదు. ఉదయం నుంచే ఎండ మొదలై నిప్పుల కుంపటిని తలపిస్తుండడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఇళ్లలో ఉన్న ఉక్కపోతతో సతమతమవుతున్నారు. సోమవారం జిల్లాలోని ముదిగొండ మండలం పమ్మిలో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని మిగతా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉండగా పగటి వేళ రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. కాగా, పమ్మిలో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బాణాపురంలో 43.9, నేలకొండపల్లిలో 43.9, చింతకానిలో 43.9, మధిరలో 42.5, ఖానాపురంలో 42.3, పల్లెగూడెం, లింగాల, ఎర్రుపాలెంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వైభవంగా ఆధ్యాత్మిక దినోత్సవం

- ఈనెల 21న ఆలయాల్లో హోమాలు, అభిషేకాలు, పూజలు
- అర్చక, ఉద్యోగుల సమావేశంలో దేవాదాయ శాఖ ఏసీ సులోచన



అర్చక, ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సులోచన

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవం వైభవంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు, అర్చకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 85 దేవాలయాలు, ధూప దీప నివేదన పరిధిలోని 310 దేవాలయాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రుద్రాభిషేకాలు, సుదర్శన హోమాలు, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేయాలని, ఇందులో ఈఓలు, ఉద్యోగులు, అర్చకులు ప్రధాన భూమిక పోషించాలని తెలిపారు. ఆలయ కమిటీల సహకారంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో శాఖ సూపరింటెండెంట్ గౌరీశంకర్, ఇన్‌స్పెక్టర్లు సమత, వెంకటేశ్వర్లు, ఉద్యోగులు ఆనంద్, కొత్తూరు జగన్మోహన్‌రావు, చుండూరు రామకోటేశ్వరరావుతో పాటు ఉద్యోగ, అర్చక సంఘాల సంఘాల ప్రతినిధులు తోటకూర వెంకటేశ్వర్లు, బి.మురళి, రామారావు, రాధాకృష్ణశర్మ, దాములూరి వీరభద్రరావు, రామశర్మ, నరహరి రామకృష్ణమాచార్యులు, ప్రసాద్‌శర్మ, భార్గవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఐటీ హబ్‌లో జరిగే పారిశ్రామిక ప్రగతి ఉత్సవంలో ఆయన పాల్గొంటారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో సోలార్ ప్యానెళ్లతో కూడిన వాహనాల పార్కింగ్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

కలకోట చెరువుకు గండి

తూమును ధ్వంసం చేసిన వ్యక్తులు



చెరువుకు గండి పెట్టడంతో వృథాగా పోతున్న నీరు

బోనకల్: మండలంలోని కలకోట పెద్ద చెరువు తూమును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి జేసీబీ సాయంతో ధ్వంసం చేసి గండి పెట్టారు. దీంతో చెరువులో నీరంతా పొలాల్లోకి వెళ్లింది. సోమవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో గండి కొట్టిన ప్రదేశాన్ని ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, జేఈ రాజేష్ పరిశీలించారు. ఈ ఘటనతో చెరువులో నీరంతా వృథా కాగా... నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల బడిబాట ఇన్‌చార్జ్, డైరెక్టర్ శ్రీనివాసాచారి సూచించారు. కూసుమంచిలో సోమవారం నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఆయన పాల్గొని పలువురి ఇళ్లకు వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కోరారు. అనంతరం శ్రీనివాసాచారి మాట్లాడుతూ మన ఊరు–మన బడిలో భాగంగా మొదటి విడతలో ప్రభుత్వం మూడు వేల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. ఈ పనుల్లో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ముందుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే కాక పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంఓ రాజశేఖర్, ఎంఈఓ బీ.వీ.రామాచారి, హెచ్ఎం విక్రంరెడ్డి, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,000	5,500
మిర్చి	20,000	12,500
ఏ/సీ మిర్చి	24,500	18,500
మిర్చి తాలు	12,500	8,000
పత్తి	6,800	6,700

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

అందరి కృషితో ‘విద్యుత్’ విజయం

విద్యుత్ ప్రగతి వేడుకల్లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



సత్తుపల్లి సభలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ఎమ్మెల్యే సండ్ర తదితరులు

సత్తుపల్లిటౌన్: తెలంగాణ ఏర్పడ్డాక ఇంజనీర్లు, విద్యుత్ సిబ్బంది కృషితో ప్రజలు నాణ్యమైన విద్యుత్ అందుతోందని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. సత్తుపల్లిలో సోమవారం జరిగిన విద్యుత్ ప్రగతి వేడుకల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో ప్రగతి సాధించేందుకు విద్యుత్ ప్రధాన భూమిక పోషిస్తోందని చెప్పారు. 24 గంటల విద్యుత్ సరఫరా అవుతుండగా, విద్యుత్ ఉత్పత్తిలో సత్తుపల్లి ఓసీల నుంచి వస్తున్న బొగ్గు కీలకంగా మారిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులు నలుగురైదుదురు కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ కీలక సమయాల్లో విద్యుత్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని అభినందించారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీఈఈ రాములు, ఆర్డీఓ సూర్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ సుజాత, ఎంపీపీలు దొడ్డా హైమావతి, లక్కినేని అలేఖ్య, జెడ్పీటీసీలు కూసంపూడి రామారావు, కట్టా అజయ్‌కుమార్, చెక్కిలాల మోహన్‌రావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, ఏడీఈలు ప్రసాద్‌బాబు, ఖాదర్‌బాబా, యాదగిరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్‌కు పెద్దపీట

ఖమ్మంవ్యవసాయం: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం జరుగుతోందని వక్తలు పేర్కొన్నారు. ఖమ్మం టీఎన్జీవోస్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ ప్రగతి ఉత్సవానికి ఎస్ఈ ఏ.సురేందర్ అధ్యక్షత వహించగా మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం గణనీయంగా సబ్సిడీలు ఇస్తోందన్నారు. అలాగే, వివిధ వర్గాలకు వారికి రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్ఈ సురేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక జిల్లాలో విద్యుత్ ప్రగతి గణనీయంగా పెరిగిందని తెలిపారు. తొలుత ధూంధాం కళాకారుల ఆటపాటలు అలరించగా లబ్ధిదారులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాస్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు, విద్యుత్తు శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, సభా ప్రాంగణంలో టీఎస్ రెడ్‌క్యాప్(తెలంగాణ స్టేట్ రెన్యూవల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) సంస్థ ఉద్యోగులు సౌర విద్యుత్ వినియోగం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఖమ్మం డివిజన్ డివిజనల్ ఇంజనీర్ నంబూరి రామారావు, ఏడీఈ రమేష్, రెడ్‌కో మేనేజర్ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం సభలో మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్, పక్కన మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్ తదితరులు

పర్యావరణ దినోత్సవంలో ‘వనజీవి’



మొక్కల ప్రాధాన్యతను వివరిస్తున్న రామయ్య

ఖమ్మంరూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులు హైదరాబాద్‌లో సోమవారం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓ ప్రైవేట్ సంస్థ ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మొక్కలు నాటారు. అలాగే, మొక్కలు నాటడం, సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జీ.బీ.కే.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ మెగా క్యాంపునకు ఆదరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయం పరిధిలోని గాంధీచౌక్, జిల్లా పరిషత్(పాత కలెక్టరేట్) బ్రాంచ్ పోస్టాఫీసుల్లో సోమవారం నిర్వహించిన ఆధార్ మెగా క్యాంపునకు ఆదరణ లభించింది. ఉదయం నుంచే పలువురు చేరుకోగా రాత్రి 8 గంటల తర్వాత వరకు వేచి ఉండడం కనిపించింది. రాత్రి పొద్దుపోయే వరకు గాంధీచౌక్ పోస్టాఫీస్‌లో 58 మంది, జిల్లా పరిషత్ పోస్టాఫీస్‌లో 55 మంది ఆధార్ సేవలను పొందారని అధికారులు తెలిపారు. ఇకనుంచి నిర్దేశిత పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.



జెడ్పీ పోస్టాఫీస్‌లో వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగులు

రెజ్లర్ల పోరాటానికి సీసీప సంఘీభావం

- బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ అరెస్టుకు డిమాండ్
- ఖమ్మంలో నిరసన తెలిపిన ప్రత్యామ్నాయ పౌర సమూహం



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా రెజ్లర్లను వేధించిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని కోరుతూ ప్రత్యామ్నాయ పౌర సమూహం(సీసీపీ) బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఖమ్మం జెడ్పీ సెంటర్‌లో సోమవారం ప్రదర్శన చేపట్టారు. సీసీపీ సభ్యులు డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సంఘీభావ సభలో సీసీపీ నాయకుడు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ రెజ్లర్లకు న్యాయం చేయని పక్షంలో ప్రపంచ రెజ్లింగ్ సమాఖ్య నుంచి భారత్‌నుతొలగిస్తామని హెచ్చరించినా కేంద్రానికి చలనం లేదని ధ్వజమెత్తారు. రెజ్లర్ల పోరాటానికి క్రీడా సంఘాలన్నీ మద్దతు ఇవ్వాలని సీసీపీ సభ్యుడు రవిమారుత్ కోరారు. అలాగే, డాక్టర్లు నాగమణి, రెహనాబేగం, స్వర్ణ భాస్కర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, కార్పొరేటర్ కమర్తపు మురళి, ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లుతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు జి.రామయ్య, రాజేంద్రప్రసాద్, శిరోమణి, పోటు కళావతి, బండి పద్మ, భారతి, బోడేపూడి శైలజ, పొన్నం ప్రియాంక, భారవి, బండారు రమేష్, ఐవి రమణారావు, లింగాల రవికుమార్, దామోదర్, చిర్రా రవి, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, బాగం అజిత, మారం కరుణాకర్‌రెడ్డి, తిలక్, బాణాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా సర్దార్ పటేల్ స్టేడియంలో ఎస్ఎఫ్ఐ పూర్వవిద్యార్థుల కమిటీ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించగా కన్వీనర్ ఎం.సుబ్బారావుతో పాటు రాజు, ఉన్నం లక్ష్మీనారాయణ, డాక్టర్ గోపీనాథ్, రవిమారుత్, ఐ.వీ.రమణారావు హాజరయ్యారు.

చేపల వేట ఆరంభం

- వైరా రిజర్వాయర్‌లో మొదలుపెట్టిన మత్స్యకారులు
- అంతా ఎగుమతి చేయడంతో స్థానికుల ఇక్కట్లు



రిజర్వాయర్‌లో వేట సాగిస్తున్న మత్స్యకారులు, (ఇన్‌సెట్) మత్స్యకారుడి చిక్కిన 12 కిలోల చేప

జిల్లాలో చేపల పెంపకానికి పెట్టింది పేరైన వైరా రిజర్వాయర్‌లో సోమవారం చేపల వేట ప్రారంభించారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక వైరా మత్స్యపారిశ్రామిక సంఘం పరిధిలో సభ్యత్వం కలిగిన మూడు మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు దిగారు. మొదటి రోజు 80 నుండి 90 టన్నుల చేపలు పట్టినట్లు చెబుతున్నారు. అయితే, వైరా, పరిసర ప్రాంతాల ప్రజలకు చేపలు తినే యోగం కలగలేదు. కాంట్రాక్టర్ చేపలన్నింటికీ ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయడంతో స్థానికులు తమకు తెలిసిన మత్స్యకారులను బతిమిలాడుకుని మరీ చేపలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. – వైరా



క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి

మధిర: క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డాక్టర్ పృథ్వీనాయక్ సిబ్బందికి సూచించారు. మండలంలోని దెందుకూరు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఎంపీ, హెటిరో సంస్థ అధినేత డాక్టర్ బండి పార్థసారథి సమకూర్చిన న్యూట్రిషన్ కిట్లను బాధితులకు ఆయన అందజేసి మాట్లాడారు. అలాగే, బోదకాలు వ్యాధిగ్రస్తులకు సామగ్రి పంపిణీ చేశారు. సిబ్బంది సందీప్, కొండయ్య, గోవింద్, సుబ్బలక్ష్మి, కౌసల్య, వినీల తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

మధిర: మధిరలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం దారిన వెళ్లే వ్యక్తులపై తిరగబడ్డాడు. కర్రతో దాడులకు ప్రయత్నిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే బ్లూకోట్ కానిస్టేబుల్, ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల జ్యోతి రామకృష్ణ సాయంతో సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బోనకల్: మండలంలోని బోనకల్–ముష్టికుంట్ల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా బండిపాలెం గ్రామానికి చెందిన నల్లపు సుమతి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డుపై గుంతను గమనించక కిందపడ్డారు. ఆవెనుకే మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న సుమతి వాహనాన్ని గుర్తించగా ఢీకొట్టి పడిపోయారు. ఈ ఘటనలో సుమతికి తీవ్రగాయాలు కాగా, మిగతా వారు స్వల్పంగా గాయపడగా 108లో ఖమ్మం తరలించారు.

ఏదులాపురం క్రాస్ వద్ద..

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం క్రాస్ వద్ద హోటల్ పక్కన సోమవారం సాయంత్రం నిలబడి ఉన్న తీగల రమాదేవిని ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. హోటల్ నడుపుతూ జీవనం సాగించే ఆమె నిలబడి ఉండగా, ఆరెంపుల నుండి ఖమ్మం వైపు వెళ్తున్న వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

దేశంలో బ్రిటీష్ తరహా పాలన

- బీజేపీ, టీఆర్ఎస్ హయాంలో వెనక్కి వెళ్తున్న సమాజం
- పీవైఎల్ రాష్ట్ర మహాసభల్లో ఎన్‌డీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని



ఖమ్మంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్‌డీ, పీవైఎల్ నాయకులు, కార్యకర్తలు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర, రాష్ట్ర పాలకులు నిర్బంధ, నిరంకుశ విధానాలను అమలుచేస్తుండగా, ప్రశ్నిస్తే, విమర్శిస్తే నేరంగా పరిగణించేలా బ్రిటీష్ తరహా పాలన సాగిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు సాధినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. పీవైఎల్ రాష్ట్ర రెండో మహాసభలు సోమవారం ఖమ్మంలో జరిగాయి. తొలుత ధర్నాచౌక్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు న్యూడెమోక్రసీ నాయకులు, పీవైఎల్ కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు వరదయ్య అధ్యక్షతన జరిగిన సభలో సాధినేని మాట్లాడుతూ 2014 నుంచి 2023 ఏడాది వరకు పోలిస్తే అన్ని వర్గాల ప్రజల హక్కులు హరించివేశారని పేర్కొన్నారు. ఆదివాసీలను వెళ్లగొట్టే యత్నాలు జరుగుతుండగా, ప్రశ్నించిన గౌరీలంకేష్, దభోల్కర్ తదితరులను బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్ శక్తులు హత్య చేశాయని ఆరోపించారు. ఇక కార్పొరేట్ల కోసమే పాలకులు పనిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో ఎన్నో ఆశలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు పేపర్ల లీకేజీతో తీవ్ర అన్యాయానికి గురయ్యారని తెలిపారు. ఈమేరకు ప్రభుత్వాల విధానాలపై యువత పోరాటాలు చేయాలని సాధినేని పిలుపునిచ్చారు. ఈ సభలో ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, బాబూరావు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏ.నర్సింహారెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.వేరు, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్‌తోపాటు చిట్టిబాబు, తుడుం వీరభద్రం, ఎం.రమేష్, వీరేందర్, గిరి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో ఎగిసిపడిన మంటలు



ఎగిసిపడుతున్న మంటలు

పెనుబల్లి : పెనుబల్లిలోని వరి పొలాల్లో గడ్డికి సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో మంటలు ఎగిసిపడ్డాయి. పొలాల గట్లపై తాటి చెట్లు, ఎండిన పొదలకు అంటుకోవడమే కాక గ్రామంలోని హెచ్‌పీ గోదాం వద్దకు మంటలు రావడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంతలోనే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయగా అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కూసుమంచి శివాలయంలో చోరీ

కూసుమంచి: కూసుమంచిలోని శివాలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ గేట్ తాళాలు పగులగొట్టి లోనకు ప్రవేశించాక హుండీని పగులగొట్టి రూ.5వేల మేర నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం గుర్తించిన స్వీపర్ ఇచ్చిన సమాచారంతో ఈఓ శ్రీకాంత్ ఫిర్యాదు చేయగా పోలీసులు పరిశీలించారు. కాగా ఇదే తరహాలో నెల క్రితం కూడా చోరీ జరిగింది.

గడ్డి మందు తాగిన వృద్ధుడు మృతి

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడుకు చెందిన అమ్మటి వెంకన్న(60) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకన్న భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా తల్లి వద్దే ఉంటూ కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసైన జీవితంపై విరక్తితో ఆదివారం సాయంత్రం గడ్డి మందు తాగగా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న సోమవారం మృతి చెందినట్లు ఆయన కుమార్తె మమత ఇచ్చిన ఫిర్యాదుతో రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సరఫరా కోసం అర్ధరాత్రి రాస్తారోకో

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి సంతబజార్‌లో ఐదు రోజులుగా రాత్రి వేళ కరెంట్ కోత విధిస్తున్నారు. దీంతో విసిగిపోయిన స్థానికులు ఆదివారం అర్ధరాత్రి జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగగా ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఐదు రోజుల నుంచి రాత్రి వేళ కరెంట్ లేక ఉక్కపోత, దోమలతో అల్లాడిపోతున్నామని తెలిపారు. స్థానిక 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ పడడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని ఉద్యోగాలకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో అక్కడకు చేరుకున్న ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

షార్ట్ సర్క్యూట్‌తో రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం

ఖాళీ బస్తాలు, ధాన్యం కాలిపోవడంతో రూ.కోటి మేర నష్టం

సత్తుపల్లిటౌన్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం ఏర్పడగా రూ.కోటి మేర ఆస్తినష్టం జరిగింది. వివరాలు... ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని సిద్ధారం రోడ్డులోని శ్రీవెంకటేశ్వర రా అండ్ బాయిల్డ్ రైస్‌మిల్లులోని గన్నీ సంచుల గోదాంలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు మొదలయ్యాయి. అంతకంతకు మంటలు పెరుగుతుండగా ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయగా ఫైరింజన్లు అందుబాటులో లేకపోవటంతో మంటలు చెలరేగాయి. గోదాం మొత్తం అంటుకోవటంతో మిల్లు ఎదురుగా ఉన్న కిన్లే ఫ్యాక్టరీ యాజమాన్యం చొరవతో పైప్‌లైన్ వేసి నీటితో మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. ఆ తర్వాత సత్తుపల్లి, అశ్వారావుపేట ఫైరింజన్లు రావడంతో పూర్తి స్థాయిలో అదుపులోకి తెచ్చాయి.



రైస్‌మిల్ గోదాంలో ఎగిసి పడుతున్న మంటలు



కిన్లే ఫ్యాక్టరీ నీటితో మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది

కిన్లే నుంచి పైప్‌లైన్‌తో నీరు చల్లకపోతే భారీ ఎత్తున నష్టం జరిగేదని చెబుతున్నారు. ఈ ఘటనలో సుమారు లక్ష వరకు ఖాళీ గన్నీ సంచులు, వెయ్యి ధాన్యం బస్తాలు దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసర్ ఐ.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించగా, రూ.కోటి మేర ఆస్తినష్టం జరిగిందని రైస్‌మిల్ యజమాని పత్తి కిషోర్ తెలిపారు.